క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల సర్వే



అయిజ: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిజమైన అర్హులను గుర్తించేందుకు అధికారులు ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. మంగళవారం మండలంలోని చిన్నతాండ్రపాడులో ఎంపీడీఓ వెంకటయ్య జాబితాలోని ప్రతి ఇంటిని పరిశీలించి అనర్హులను గుర్తించారు. అదే విధంగా మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహించి అనర్హులను గుర్తించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి



రాజోళి: సొంత ఇళ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామస్తులు ఆందోళన చేశారు. మంగళవారం ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని వివరించారు. అధికారులు విడుదల చేసిన జాబితా మొత్తం అవకతవకలుగా ఉందని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



అయిజ: ఈనెల 18న గద్వాలలో నిర్వహించనున్న పౌర హక్కుల సంఘం 16వ మహాసభను విజయవంతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సుభాన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పౌరహక్కుల సంఘం నాయకులు మహా సభకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మహదేవ్, కార్యవర్గ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ జాతర

ఉండవెల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఈదమ్మ జాతర సందర్భంగా ఊర వాకిలి నుంచి డప్పు చప్పులతో ఈదమ్మ ఆలయానికి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో కోలాటాలతో చిన్నారులు అలరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు గోద జయ్యన్న, గోవిందు, చిన్న నాగేంద్రం, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, ముత్యాల్ రెడ్డి, మహదేవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తంటాలు



ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల గ్రామంలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు లేక బోరు నీటి కోసం మహిళలు క్యూ కట్టారు. మంగళవారం తక్కశీల, ఉండవెల్లిలో జాతర సందర్భంగా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. తాగునీటి కోసం తంటాలు పడుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన రాజు ఆటోలో తన భార్యాపిల్లలతో కలిసి ఈ నెల 10న మండలంలోని గుంతకోడూరు గ్రామంలో మిరపకాయలు తీయడానికి వచ్చారు. అయితే తాడూరు సమీపంలో ఆటో అదుపు తప్పి కిందపడగా.. రాజు భార్య చెన్నమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటనపై చెన్నమ్మ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మాకేవి.?

- జాబితాలో పేరు లేదని అర్హుల ఆవేదన
- గ్రామాల్లో జాబితా ప్రకటనతో అలజడులు
- అధికారులకు వినతుల వెల్లువ



ఉండవెల్లిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ యువత(ఫైల్)

ఉండవెల్లి: తెలంగాణ ప్రభుత్వం పేదలకు సొంతిళ్లు ఉండాలనే లక్ష్యంతో గృహలక్ష్మీ పథకం ప్రవేశపెట్టింది. పథకంలో పెంకుటిల్లు, శిథిలమైన ఇళ్లు, అద్దెకు నివాసం ఉండేవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో పేదల నుంచి అనేక దరఖాస్తులు రాగా.. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజా పాలనలో అర్హులను గుర్తించి నివేదికలు అందజేశారు. దరఖాస్తుల్లో సగానికి పైగా నిబంధనల ప్రకారం తిరస్కరించగా, ఉన్న వారిలో ఎవరికి వస్తుందో ఎవరికి రాదోనని అర్హులు ఆశగా ఎదురుచూస్తుండగా జాబితాలో పేరు రాని నిజమైన అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2వేల మంది అర్హులు

మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో 80 వేల మంది జనాభాలో 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. సర్వేలో 2 వేల మందిని అర్హులను గుర్తించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయిన పిమ్మట పథకం అమలు పర్చేందుకు అన్ని సిద్ధం చేశారు.

ప్రజల ఆందోళనలు

మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల పేరుతో పథకాన్ని అబాసుపాలు చేస్తున్నారని పేదలు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రకటించిన జాబితాలో నిజమైన అర్హులను పక్కన పెట్టి పొలాలున్న వారిని, చిరు ఉద్యోగులను, ఇళ్లు ఉన్న వారిని, పార్టీలకు సంబంధించిన వారిని అర్హులుగా ఎంపిక చేస్తున్నారని మండిపడుతున్నారు. నిజమైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఉండవెల్లి, చిన్నఆముదాలపాడులో అసలైన అర్హులను గుర్తించలేదని ఇటీవల ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. తక్కశీల, మారమునగాల, బైరాపురం గ్రామాల్లో సర్వే చేపడుతున్న అధికారులను అడ్డుకున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని రీసర్వే చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని బస్వాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, కలెక్టర్ చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందించారు. చిన్న ఆముదాలపాడులో 15 మంది అర్హులుగా గుర్తించి, ప్రస్తుతం 10 మందిని మాత్రమే ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీల నిజమైన పేదలకు న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉండవెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

పేరు తొలగించారు

కొన్నేళ్లుగా రేకుల షెడ్డులో కుమార్తెలు, మనవరాళ్లతో నివాసమంటున్నాం. గాలివానకు షెడ్డు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ కమిటీ నాయకులు, అధికారులు జాబితాలో పేరు తొలగించారు. మాలాంటి నిజమైన పేదల పేర్లు కూడా జాబితాలో తొలగించడం అన్యాయం.

– రేణుక, ఉండవెల్లి

కూలి పనికి వెళ్తున్నాం

ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇంటికి దరఖాస్తు చేసుకుంటే అప్పుడు మంజూరు కాలేదు. కిరాయి ఇంట్లో ఉంటూ కూలి పనులకు వెళ్తుంటాం. ప్రస్తుతం ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు లేదని చెబుతున్నారు. అధికారులకు వినతిపత్రాలు కూడా అందించాం. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలి.

– సుధాకర్, చిన్న ఆముదాలపాడు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శాంతినగర్: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి స్వరూపరాణి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని వెంకట్రామనగర్‌లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 201 పశువులకు టీకాలు వేసినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, పాలాగు, కృష్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.



ఎల్కూర్‌లో టీకాలు వేస్తున్న వైద్యురాలు ఉష

మల్దకల్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారులు వినయ్‌కుమార్, ఉష సూచించారు. మంగళవారం మండలంలోని బిజ్వారం, ఎల్కూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పాడి పశువులు ఉన్న రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 476 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రాజేంద్ర, యుగంధర్‌రెడ్డి, గోవర్ధన్, అర్జున్‌సింగ్, రామాంజనేయులు, రాము, రామేశ్వరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

సంపు నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, అధికారులు

గట్టు: మండల పరిధిలోని చిన్నోనిపల్లి ఆర్అండ్ఆర్ సెంటర్‌లో మిషన్ భగీరథ సంపు నిర్మాణ పనులకు, అంతంపల్లి, ఈడిగోనిపల్లి, సంకాపురం గ్రామాలకు తాగునీటి సరఫరా నిర్మాణ పనులకు మంగళవారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. సంపు నిర్మాణం వల్ల నాలుగు గ్రామాలకు తాగునీటి సమస్య తీరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఆదిత్య, కార్యదర్శి రవీందర్‌గౌడ్, శ్రీనివాసులు, శంకరన్న, ఆంజనేయులుగౌడ్, కుర్వ నర్సింహులు, రామచంద్రగౌడ్, ఈరన్న పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాల గ్రామసభ



మాన్‌దొడ్డిలో ఉపాధి హామీపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

రాజోళి: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు మండలంలోని మాన్‌దొడ్డి, పడమటి గార్లపాడు గ్రామాల్లో మంగళవారం గ్రామసభ నిర్వహించాయి. ఉపాధి హామీ పనుల్లో కూలీలు ఎదుర్కొన్న సమస్యలు, సిబ్బంది కల్పించిన వసతులు, కూలీల చెల్లింపులు తదితర విషయాలపై గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉత్తరయ్య

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 1వ సెంటర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ చట్టంపై లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి ఉత్తరయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాకిడి అధికంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా పని వద్ద కూలీలకు టెంట్లు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారికి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, బాల్యవివాహాలను అరికట్టాలని, 18 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత న్యాయ సేవలు కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నాయవాది వెంకటస్వామి, ఏఎస్ఐ మన్యపురెడ్డి, వలంటీర్ బంకల రవి, దయాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, నవనీత్ కుమార్ పాల్గొన్నారు.

పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న క్లస్టర్ల రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాలకు రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన నవోదయ విద్యార్థులు

బిజినేపల్లి: మంగళవారం వెలువడిన సీబీఎస్ఈ ఫలితాల్లో వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాకు చెందిన 10, 12వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో మణిదీప్ 476 మార్కులు, తనిష్, భానుప్రకాష్, దీపక్ 475 మార్కులు సాధించారు. అలాగే 12వ తరగతి ఫలితాల్లో సహస్ర 462 మార్కులు, శ్రీకర్ 461 మార్కులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్, అధ్యాపక బృందం అభినందించింది.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రామానాయుడు కుటుంబ సభ్యులకు అతనితో పాటు ట్రెనింగ్ తీసుకున్న కానిస్టేబుళ్లు ఆర్థికసాయం అందజేసి వారి మిత్రత్వాన్ని చాటుకున్నారు. తనగలకు చెందిన రామానాయుడు (ఏఆర్ కానిస్టేబుల్) తన వివాహ వేడుకలకు పత్రికలు పంచడానికి హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన తనగలకు వస్తూ అయిజ మండలం కిష్టాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామానాయుడుతో ట్రెనింగ్ తీసుకున్న మిత్రులైన కానిస్టేబుళ్లు అందరూ కలిసి రూ.64 వేలు నగదును మంగళవారం మిత్రుడి తండ్రి బుచ్చన్ననాయుడుకు అందజేశారు. ఈ నేపథ్యంలో సదరు కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ఆభరణం అందజేత



శాంతినగర్: పోగొట్టుకున్న బంగారు ఆభరణాన్ని బాధితురాలికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు ఓ వ్యక్తి. వివరాలు.. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో ఉంటున్న గౌషియాబేగం దేవర ఉత్సవాలకు ఆటోలో షాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో బ్యాగు పడిపోయింది. అటు వైపుగా వెళ్తున్న కొంకల గ్రామానికి చెందిన టైలర్ ఆంజనేయులకు దొరకగా అతడు శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో బ్యాగు పోలీసులకు అప్పగించాడు. బ్యాగులో ఉన్న బంగారు ఆభరణం కొన్నరోజులు గుర్తించిన ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి బాధితులకు సమాచారం అందించగా బాధితుల కుటుంబ సభ్యులు స్టేషన్‌కు చేరుకుని బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని టైలర్ ఆంజనేయులు, పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. ధరూరు మండలానికి చెందిన పరుశురాముడు కుటుంబంతో బైక్‌పై కర్నూల్‌కు వెళ్తుండగా అలంపూర్ చౌరస్తాలోని సర్వీస్ రోడ్డులో ఏజీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద కుక్క అడ్డుగా రావడంతో కుక్కను తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ప్రమాదంలో పరుశురాముడి, అతని కుమార్తె గౌతమికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ ఈఎంటీ రాజరత్నం, పైలెట్ రవి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ నళిని

అయిజ: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని వీడి ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని ఉప్పల గ్రామంలో మంగళవారం రైతు వేదిక భవనంలో మండల వ్యవసాయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శంకర్, పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ నళిని పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడటం వలన భూమి, నీరు, గాలి కాలుష్యమవుతున్నాయన్నారు. పంటలు విషతుల్యమవుతున్నాయన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు మార్చుకోవాలని, సేంద్రీయ ఎరువులతో పంటలు పండించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై పలు సలహాలు, సూచనలు చేశారు. పచ్చిరొట్ట ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. దేశవాళీ విత్తనాలు విత్తుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు, సూక్ష్మ పోషకాల లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు. పంట పొలాల్లో పచ్చరంగు బంతిపూలను పెంచి, ఎరలు ఏర్పాటు చేసుకొని క్రిమీ కీటకాల నుంచి పంటను కాపాడుకోవాలన్నారు. యూరియా వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, అవసరం మేరకే రసాయనాల వినియోగం, రశీదులు భద్రపరుచుకోవాలన్నారు. నష్ట పరిహారం పొందడం, సాగునీటిని ఆదా చేయడం, పంటమార్పిడి పాటించడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం అనే అంశాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో ఏఈఓలు స్వాతి, అనిల్‌కుమార్, యువరాజు, లోకరాజు, జయన్న, అరవింద్, సతీష్, నవీన్, ఈశ్వర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



బ్రోచర్లను విడుదల చేస్తున్న ప్రతినిధులు

ధరూరు: మండల పరిదిలోని పెద్దపాడు గ్రామంలో లైఫ్ ఛేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులు, యువతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి లైఫ్ ఛేంజ్ ఫౌండేషన్ ప్రతినిధి శిరీష హాజరై మాట్లాడారు. న్యూట్రీషియన్, ఎనీమియా, ఎండ తీవ్రతపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలతో పాటు వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పరుశరాముడు, ఆశా వర్కర్లు, బుక్ కీపర్లు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

అలంపూర్: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద టోల్‌ప్లాజా కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మంగళవారం సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. కార్మికుల 8 గంటల పని సమయం, కనీస వేతనం రూ. 26 వేలు తదితర డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాలు కలిసి సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉండవెల్లి మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, టోల్‌ప్లాజా యూనియన్ నాయకులు మద్దయ్య, రాజశేఖర్, వెంకట్రాముడు, రాముడు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం



ఈదురు గాలులకు కూలిన రైస్‌మిల్ నిర్మాణం



ధరూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం సంచులు

ధరూరు: మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి 11 గంటల నుంచి 12 గంటల వరకు పెద్ద ఎత్తున గాలులు వీచాయి. మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలోని నూతనంగా నిర్మితమవుతున్న రైస్ మిల్ యాంగ్లేర్స్ గాలికి వంగిపోయాయి. స్థానిక వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పి ఉంచిన టార్పాలిన్లు గాలికి లేచిపోవడంతో అర్ధరాత్రి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యం కొంత మేర తడిసాయి. ఈదురు గాలులలకు పంటలు నేలవాలాయి. గాలులు కారణంగా మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి



కొంకలలో మాట్లాడుతున్న శివలీల



తుమ్మలచెర్వులో మాట్లాడుతున్న అధికారి నర్సింహ

శాంతినగర్: బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో 1098, బాలల పరిరక్షణ, సంక్షేమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. బాలలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణకు 1098ను సంప్రదించాలన్నారు. బాలల పరిరక్షణ చట్టాలు, తల్లిదండ్రులు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. కమిటీల ముఖ్య ఉద్దేశం గ్రామంలోని బాలల సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. బాల్య వివాహాలు జరుగుకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శాంతిశ్రీ, ఏఎన్ఎం వెంకటేశ్వరి, చిట్టెమ్మ, నాగరాజు, కృష్ణయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: బాలలను లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మండలంలోని బోరవెల్లి గ్రామంలో మంగళవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విలేజ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. బాలల లైంగిక వేధింపుల చట్టం 2012 గురించి అవగాహన కల్పించారు. చట్టం బాలబాలికలకు సమానమైన రక్షణ కల్పిస్తుందన్నారు. లైంగిక వేధింపులకు గురైన వారు 100, లేద 1098కు సమాచారం అందించాలన్నారు. సామాజిక మాధ్యమాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, కార్యదర్శి అత్రు, ఏఓలె అనూష, ఇందిరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, పద్మావతి, ఫౌజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

గట్టు: బాలల సంరక్షణ అందరి బాధ్యతని బాలల సంరక్షణ జిల్లా అధికారి నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలచెర్వులో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలందరు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సురేష్, జ్యోష్న, గోపాల్, సంగీత, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోరవెల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603